

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

గూడూరు:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 రగ్బీ జిల్లా జట్ల ఎంపికను జిల్లా సెక్రటరీ దానరి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు.



18,503 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 12,825 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 18,503 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



ఫోరెన్సిక్ విభాగం ఆధునికీకరణ

లబ్బీపేట:ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఆధునికీకరించిన ఫోరెన్సిక్ విభాగాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డీవీఎస్ఎల్ నరసింహం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

చల్లపల్లి సుందరీకరణకు సీఎస్ఆర్ నిధులు

కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): చల్లపల్లి సుందరీకరణ పనులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు కేటాయించినట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల నిర్వహణ కోసం వెక్టా నూతన వాహనం కొనుగోలుకు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఆకుమర్రు మంచినీటి పథకానికి ఫిల్టర్‌బెడ్లు, మైక్రో ఫిల్టర్‌బెడ్ల ఏర్పాటుకు జిల్లా ఖనిజ నిధులతో పాటు ఎంపీ నిధులు కేటాయిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన అంచనాలు తయారుచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ నటరాజ్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్‌గౌడ్, సీపీవో గణేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునఃమూల్యాంకనం ఫలితాలు విడుదల

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు సంబంధించి పీజీ మొదటి సెమిస్టర్, ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్ పునఃమూల్యాంకనం ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి పి. వీరబ్రహ్మచారి తెలిపారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఫలితాలు విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు.

నేడు కురుమద్దాలిలో జాబ్‌మేళా

కురుమద్దాలి(పామర్రు): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కురుమద్దాలి గ్రామంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్య బ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కొసరాజు పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్ ఆవరణలోని రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా ఉంటుందని చెప్పారు. కురాకు ఫైనాన్సియల్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఉద్యోగాలకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎంపిక అయిన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.29 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

అభ్యర్థుల ఎంపిక పరీక్ష తేదీ మార్పు

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించే పరీక్ష తేదీని మార్పు చేసినట్లు సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3వ తేదీన నిర్వహించాల్సిన ఈ పరీక్ష 10వ తేదీకి మార్పు చేశామని తెలిపారు. ఈ ఎంపిక పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



కోనేరుసెంటర్: మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టీటీసీరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గుంటూరు మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనను మచిలీపట్నం వైద్య కళాశాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుందరాచారిని గుంటూరు మెడికల్ కళాశాలకు బదిలీపై పంపించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న రెడ్డికి డాక్టర్ స్వర్ణ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

వెలుగు జిలుగులు...



ఉమ్మడి జిల్లాలో దీపావళి పండుగను ప్రజలు అత్యంత వైభవంగా చేసుకున్నారు. రంగు రంగుల బాణసంచా వెలుగుల్లో బెజవాడ నగరం గురువారం రాత్రి వెలిగిపోయింది. ఇంద్రకీలాద్రిపై నుంచి చూస్తే నగరం టపాసుల కాంతులతో నిండింది. దుర్గగుడి కొలువైన ఇంద్రకీలాద్రిపై బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యుత్ వాతలు ట్రూ

- వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల పేరుతో భారం వేసేందుకు చర్యలు
- దీపావళి కానుకగా వాత పెట్టనున్న ప్రభుత్వం
- నవంబరు నెల నుంచి బిల్లుల్లో జమ
- జిల్లా ప్రజలపై రూ.200 కోట్లకు పైగా అదనపు భారం
- కృష్ణా సర్కిల్‌లో 6.40 లక్షల విద్యుత్ కనెక్షన్లు



సాక్షి, మచిలీపట్నం: విద్యుత్ వినియోగదారులపై వాతలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీపావళి పండుగ కానుకగా చార్జీల భారం వేయనుంది. ఈ నెలలోనే దసరా ధమాకాగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన సర్కారు.. ఇప్పుడు వెలుగు పండుగకు షాక్ ఇచ్చింది. గతంలో వాడిన విద్యుత్‌కు సంబంధించినవి అంటూ ట్రూ అప్ చార్జీల పేరుతో నెల వారీ విద్యుత్ బిల్లులతో పాటు అదనంగా దీనిని వసూలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6వేల కోట్లకు పైగా భారం వేస్తుంగా జిల్లా ప్రజలపై రూ.200 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది. బిల్లు చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నవంబరు నెల నుంచి బిల్లులు చూస్తే షాక్‌కు గురికాక తప్పదు.

ఈఆర్‌సీ ఉత్తర్వులతో చర్యలు

ట్రూ అప్ చార్జీల వసూలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈఆర్‌సీ (ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్) ఈ నెల 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థల ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు విడుదల కావడంతో నవంబరు నెల నుంచే బిల్లుల్లో దీనికి సంబంధించిన చార్జీలు జమ చేసేందుకు స్థానిక అధికారులు చర్యలు చేపట్టారు.

2026 జనవరి వరకు వాతలే

ట్రూ అప్ చార్జీల పేరుతో మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వసూలు చేస్తున్న అదనపు చార్జీల ప్రభావం 2026 జనవరి వరకు ఉండనుంది. ప్రతినెలా వాడే విద్యుత్ యూనిట్ల చార్జీ, సర్వీసు చార్జీ, ఇతర సెస్సులతో పాటు ఈ ట్రూ అప్ చార్జీలు కలపనున్నారు.

2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వాడిన విద్యుత్ యూనిట్ల ట్రూ అప్ చార్జీలను కలపనున్నారు.

ఎవ్వరినీ వదల్లేదు

విద్యుత్ చార్జీల పెంపులో ఏ ఒక్కరినీ వదలకుండా ప్రభుత్వం భారం మోపింది. సింగిల్ లైటు ఉన్న గృహ వినియోగదారుడి నుంచి వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, కుటీర, భారీ పరిశ్రమలు, పంచాయతీలు, మున్సిపాలిటీల వీధి దీపాలు, వ్యవసాయ కనెక్షన్ల వినియోగదారులపై భారం వేయనున్నారు.

2022 ఏప్రిల్‌లో వాడితే ఇప్పుడు వాత

2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్‌పై ట్రూప్ చార్జీల పేరుతో నవంబరు నెల నుంచి అదనంగా వేయనున్నారు. ఆ నెలలో ఒక యూనిట్ వాడితే దానిపై రూ.1.2089 పైసల చొప్పున వసూలు చేయనున్నారు. వెయ్యి యూనిట్లు వాడితే రూ.1,208.90 పైసలు, 500 యూనిట్లు వాడితే రూ.604.45 పైసల చొప్పున అదనంగా వేస్తారు. అయితే ఈ మొత్తాన్ని రెండుగా చేసి నవంబరు బిల్లులో సగం, డిసెంబరు నెల బిల్లులో సగం జమ చేసి వసూలు చేయనున్నారు.

స్పాట్ బిల్లింగ్‌కు సిద్ధం

బిల్లుల్లో ట్రూప్ అప్ చార్జీలు అదనంగా జమ చేసేందుకు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఇప్పటికే సంస్థ ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. 2022 ఏప్రిల్ నుంచి వాడిన యూనిట్ల లెక్కలు సేకరించి.. సాఫ్ట్‌వేర్ సిద్ధం చేశారు. నవంబరు 1 నుంచి వియోగదారులకు స్పాట్ బిల్లింగ్ ద్వారా బిల్లులు జారీ చేస్తారు. విద్యుత్ మీటర్‌ను రీడర్ స్కాన్ చేసిన వెంటనే.. ప్రస్తుత నెల యూనిట్ల చార్జీలతో పాటు గతంలో వాడిన యూనిట్ల ట్రూ అప్ చార్జీలు కలిపి బిల్లు ఇచ్చేందుకు సాఫ్ట్ వేర్ సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

రూ. 200 కోట్లు బాదేస్తారు

ట్రూ అప్ చార్జీల భారం భారీగానే ఉండనుంది. జిల్లాలో సుమారు ప్రతి నెలా 133 మిలియన్ యూనిట్లు (13.30 కోట్ల యూనిట్లు) వాడకం జరుగుతోంది. 2022 ఏప్రిల్ నెల నుంచి 2023 మార్చి వరకు ఇలా 12 నెలలకు ట్రూప్ చార్జీల కింద వసూలు చేస్తారు. ప్రతి నెలా రూ.1.2089 పైసల నుంచి రూ.1.5483 పైసల వరకు ఉండనుంది. మొత్తంగా రూ.200 కోట్లకు పైగా భారం వేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో 6.40 లక్షల వినియోగదారుల ఉండగా 2023 మార్చి కంటే ముందు విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వారిపై ప్రతి నెలా ఈ భారం పడనుంది.

ట్రూ అప్ చార్జీల వసూలుకు ఏర్పాట్లు



ఉన్నతాధికారులు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటాం. గతంలో సంస్థ అధిక ధరలకు విద్యుత్ కొని, వినియోగదారులకు అందించింది. దీనిపై ట్రూ అప్ చార్జీలు వసూలు చేసేలా సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఎం. సత్యానందం, ఆపరేషన్స్ ఎస్ఈ, కృష్ణా జిల్లా

ఐకమత్యంతో జాతీయ సమైక్యత



రన్ ఫర్ యూనిటీలో పాల్గొని సిబ్బందిని ఉత్సాహపరిచిన ఎస్పీ గంగాధర్‌రావు

కోనేరుసెంటర్: కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పిలుపునిచ్చారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్ట్ సెంటర్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా ఎస్పీ, ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ బి.సత్యనారాయణ, బందర్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు సిబ్బందితో పాల్గొన్నారు. పరుగు అనంతరం ఏఆర్ పోలీస్ పెరేడ్ మైదానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం 564 సంస్థానాలుగా విడిపోయి ఉన్న దేశాన్ని ఒకటిగా చేసి ఏకతాటిపై నడిపించిన మహనీయుడు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివాస్ గా జరుపుకోవడం గర్వించదగిన అంశమన్నారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడంలో పటేల్ పాత్ర అద్భుతమన్నారు. అందుకు ప్రతీకగా హైదరాబాదులోని జాతీయ పోలీస్ అకాడమీకి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని నామకరణం చేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు. వల్లభాయి పటేల్ మరణానంతరం భారతరత్న బిరుదుతో ప్రభుత్వం ఆయన సేవలను కొనియాడిందన్నారు. చరిత్ర పుటల్లో నిలిచిపోయే వ్యక్తిత్వం కలిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం మనందరికీ ఆదర్శమన్నారు. సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ, చిత్రంలో సమావేశానికి హాజరైన అధికారులు

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నైపుణ్య గణన చేపట్టేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరి నైపుణ్యత గణన చేపట్టాల్సి ఉందన్నారు. దీని కోసం షెడ్యూల్‌ను తయారుచేసి ముందుగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలను సందర్శించాలని చెప్పారు. విద్యార్థులందరినీ నైపుణ్య యాప్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇందుకోసం నోడల్ అధికారులను గుర్తించి వారి పేర్లు, హోదా, వివరాలను నైపుణ్యాభివృద్ధి అధికారికి అందజేయాలని ఆదేశించారు. నైపుణ్య గణనపై నోడల్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రోత్సహించండి

జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త్ బిజిలీ పథకాన్ని వినియోగించుకుని లబ్ధి పొందే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పథకం వినియోగంపై విద్యుత్‌శాఖాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు బిల్లుల ఖర్చులను తగ్గించుకునేందుకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో వినియోగదారులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకున్నప్పటికీ వెంటనే సౌకర్యం కలిగించకపోవటం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశం నాటికి పురోగతి సాధించాలని ఆదేశించారు. ఇది ఎంతో మంచి పథకమని ఒక్కసారి ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవటం ద్వారా సంవత్సరాల తరబడి లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకం వినియోగంలో అవసరమయ్యే నిధుల కోసం బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని వెల్లడించారు.

ఆదర్శ సౌర గ్రామాలను గుర్తించండి.....

జిల్లాలో ఆదర్శ సౌర గ్రామాల ఏర్పాటుకు అర్హత ఉన్న గ్రామాలను గుర్తించాలని తెలిపారు. సౌరశక్తిని ప్రోత్సహించేందుకు జిల్లాకు ఒక సౌర శక్తితో పనిచేసే గ్రామాన్ని రూపొందించాలనే లక్ష్యంతో పీఎం సూర్య ఘర్ ముక్త్ బిజిలీ యోజన ఆదర్శ సౌర గ్రామాల కోసం కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఇందుకోసం జిల్లాలో 5 వేల పైబడి జనాభా కలిగిన ఐదు రెవెన్యూ గ్రామాలను గుర్తించాలన్నారు. ఆ గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, వీధి దీపాలు, మంచినీటి సరఫరా పథకాలకు పూర్తిస్థాయిలో సౌరశక్తి ఫలకాలు అమర్చుతామని స్పష్టం చేశారు. ఎంపికైన గ్రామానికి కేంద్ర ఆర్థిక సహాయంగా కోటి రూపాయల నిధులు అందిస్తుందని వెల్లడించారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా భానుమూర్తి



మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా జి. భానుమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వులను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ సుందరాచారి, ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్ వడ్డి రమేష్ చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. భానుమూర్తి ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగాధిపతిగా, ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్‌గా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రమేష్ కుమార్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత డాక్టర్ సుందరాచారి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. దీంతో ప్రభుత్వం భానుమూర్తికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సూపరింటెండెంట్‌గా నియమించింది. భానుమూర్తి శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రేపు దుర్గమ్మకు గాజుల అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): యమ ద్వితీయ, భగిని హస్త భోజనంను పురస్కరించుకుని 3వ తేదీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గాజులతో విశేషంగా అలంకరించనున్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారికి 2.50 లక్షల గాజులను అలంకరణ నిమిత్తం వినియోగిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ, ఖడ్గమాలార్చన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తితో పాటు ఆలయ ప్రాంగణాన్ని గాజులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన గాజుల దండలను సిద్ధం చేస్తున్నారు.

కన్నీటి దీపావళి

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- పది మందికి తీవ్ర గాయాలు
- లారీ, మినీ ట్రక్కు వాహనం ఢీకొనడంతో ప్రమాదం
- కూలీలు దీపావళి సంబరాల కోసం సొంతూరు వస్తుండగా ఘటన



జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ ట్రక్కు వాహనం

జి.కొండూరు(మైలవరం): పొట్టకూటి కోసం జిల్లాలు దాటి కూలి పనులకు వెళ్లారు. రోజుల తరబడి పని చేయగా వచ్చిన డబ్బులతో దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలనుకున్నారు. కూలీలంతా తమ సొంతూరుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తమతో పాటు ఉన్న మినీ ట్రక్కు వాహనంలో సొంతూరుకు బయలుదేరారు. కొద్ది క్షణాల్లో తమ గ్రామానికి చేరుకుంటామన్న సంతోషంలో మునిగి తేలుతున్న ఆ కూలీలను మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఎదురుగా వస్తున్న లారీని కూలీలు ప్రయాణిస్తున్న మినీ ట్రక్కు ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా పది మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు శివారు 30వ నంబరు జాతీయ రహదారి బైపాస్‌పై గురువారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో చోటుచేసుకుంది.

ప్రమాదం జరిగింది ఇలా..

ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన 12 మంది, మైలవరం మండల పరిధి పుల్లూరు గ్రామానికి చెందిన ఒకరు మొత్తం 13 మంది కూలీలు అక్టోబరు 11వ తేదీన నెల్లూరు జిల్లా, పొదలకూరు గ్రామానికి బొప్పాయి కోతకు వెళ్లారు. వీరికి మేస్త్రిగా ఉన్న బలగాని వెంకటేశ్వరరావుకు చెందిన మినీ ట్రక్కు వాహనం కూడా కూలీలతో పాటు ఉంది. గురువారం దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని నిర్ణయించుకున్న వీరంతా తమ సొంతూళ్లకు మినీ ట్రక్కు వాహనంలో ఈ నెల 30వ తేదీన సాయంత్రం బయలుదేరారు. 31వ తేదీ గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో వాహనం జి.కొండూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారి బైపాస్‌పైకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ ట్రక్కు వాహనం నుజ్జునుజ్జవడంతో మైలవరం మండల పరిధి పుల్లూరు గ్రామానికి చెందిన కొనకాల నాగరాజు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలో ప్రయాణిస్తున్న 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ సతీష్‌కుమార్, మైలవరం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్‌లు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు 108 అంబులెన్స్‌లు, ఒక రోడ్డు భద్రతా వాహనం సాయంతో బాధితులను విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఎ.కొండూరు మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన బొలగాని వెంకటేశ్వరరావు (32), ఉయ్యాల సాయికుమార్ (30) గురువారం ఉదయం మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన కొనకళ్ల వెంకటేశ్వరరావు, కొండపాటూరి అరుణ, తుళ్లూరు వెంకటస్వామి, తుళ్లూరు శ్రీకాంత్, తుళ్లూరు సత్యవతి, బొజ్జగాని రాకేష్, షేక్ బుజ్జి, షేక్ దుర్గారావు, తీగల పుల్లారావు, గుండాల బాలకృష్ణ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి నాగులచవితి మహోత్సవాలు



మోపిదేవి: ప్రముఖ పుణ్య క్షేత్రమైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా నాగులచవితి మహోత్సవం ఈ నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ తెలిపారు. ప్రతి రోజు గర్భాలయంలో కార్తిక మాస దీక్ష అభిషేకాలు, నెల రోజుల పాటు స్వామివారికి భక్తుల గోత్ర నామాలతో పరోక్షంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 5వ తేదీ మంగళవారం నాగుల చవితి వేడుకలు, 15వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు జ్వాలాతోరణం, 29వ తేదీ శుక్రవారం లోక కల్యాణార్థం లక్ష బిల్వార్చన ఉంటుందని తెలిపారు. లక్షబిల్వార్చన సందర్భంగా 29, 30 తేదీల్లో స్వామివారికి ఉదయం 11 గంటలకు జరిగే అభిషేకాలు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు వివరించారు.

కానూరులో యువకుడు ఆత్మహత్య



పెనమలూరు: కానూరులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంకు చెందిన గంట నాగవెంకట సత్యనారాయణ (26) గతంలో గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతూ మధ్యలో ఆపేశాడు. అతనికి తల్లిదండ్రులు లేరు. కానూరు మురళీనగర్‌లో హాస్టల్ రూమ్‌లో ఉంటున్నాడు. స్నేహితుడు పల్లపాటి మనోజ్‌విశాల్‌తో కలిసి మూడు నెలల క్రితం విజయవాడలో ఏఐ స్టార్టప్ కంపెనీ ప్రారంభించారు. సత్యనారాయణ కొద్ది కాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం తన రూమ్‌లో సీలింగ్‌ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకున్నాడు. మధ్యాహ్నం మిత్రుడు మనోజ్‌విశాల్ రూమ్‌కు వచ్చి తలుపు కొట్టగా తలుపు తెరవలేదు. తలుపు తాళం పగులకొట్టి చూడగా సత్యనారాయణ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఛాయాచిత్రాలు గత కాలపు చారిత్రక సాక్ష్యాలు

- ఘనంగా ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం
- విజయం దిశగా ప్రయాణించి గమ్యం చేరుకోవాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు



ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం సందర్భంగా క్యాట్‌లాగ్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ మన్మథరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, గోకరాజు గంగరాజు, శ్రీనివాసరెడ్డి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎవరి వృత్తిలో వారు నైపుణ్యం సాధించి విజయం దిశగా ప్రయాణించి తమ గమ్యాన్ని సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న బాలోత్సవ్ భవన్‌లో ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం -2024 ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ ఛాయాచిత్రాలు గత కాలపు చారిత్రక సాక్ష్యాలని, ప్రకృతి మనిషిని ఇబ్బంది పెడితే ఎలా ఉంటుందో ఇటీవల వచ్చిన వరదలే నిదర్శనమన్నారు. అటు వంటి వరదల్లోని ఫొటోలు చూస్తుంటే గతంలో తమ కుటుంబంతో వరదలలో బాధితుడిగా ఉన్న ఘటనలు గుర్తుకొచ్చాయన్నారు. ఎంతో కష్టపడి ప్రాణాలకు తెగించి అద్భుతంగా తీసిన ఛాయాచిత్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే వేదికను తయారుచేసి సేవాభావాన్ని ప్రదర్శిస్తున్న నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డిని అభినందించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. నేటి చరిత్రకు భవిష్యత్‌లో ఫొటోలే శాసనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫొటోగ్రఫీకి సముచిత స్థానం కల్పించాలన్నారు. నిర్వాహకుడు, ఐఐపీసీ డిజిటల్ అండ్ ఫొటో జర్నలిజం డివిజన్ చైర్మన్ టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ ఫొటో జర్నలిస్టులతో సమానంగా తెలుగు రాష్ట్రాల్లోని ఫొటో జర్నలిస్టులు కూడా అవార్డులు అందుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి 38 అవార్డులు ప్రకటించామన్నారు. ఈ సంవత్సరం 15 మెమోరియల్ అవార్డులు అందజేస్తున్నామని, వచ్చే ఏడాది 25 మెమోరియల్ అవార్డులు అందజేస్తామని చెప్పారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, క్యాన్సర్ వైద్య నిపుణుడు సుబ్బారావు ప్రసంగించారు. తొలుత ఫొటో ఎగ్జిబిషన్‌ను జస్టిస్ మన్మథరావు ప్రారంభించారు.



జస్టిస్ మన్మథరావు చేతుల మీదుగా మెమోరియల్ అవార్డు అందుకుంటున్న రూబెన్ బెసాలియల్



లక్ష్మీపవన్



చక్రపాణి

గత నెలలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ చూపిన ఏపీ, తెలంగాణ ఫొటో జర్నలిస్టులకు అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సుందర్, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫొటో జర్నలిస్టులకు అవార్డులు

రెండు తెలుగు రాష్ట్రాల ఫొటోగ్రాఫర్లకు నిర్వహించిన పోటీల్లో సాక్షి ఫొటోగ్రాఫర్లకు అవార్డులు లభించాయి. ఇద్దరు ఫొటోగ్రాఫర్లు బహుమతులు, ముగ్గురు ఫొటోగ్రాఫర్లు మెమోరియల్ అవార్డులను అందుకున్నారు.

రెండో బహుమతి కేథారి కె.మోహనకృష్ణ(తిరుపతి), మూడోబహుమతి మహ్మద్ నవాజ్(వైజాగ్)కు దక్కగా, వి.రూబెన్ బెసాలియల్ (విజయవాడ)కు యార్లగడ్డ రామనాథం మెమోరియల్ అవార్డు, సనకా లక్ష్మీపవన్ (విజయవాడ)కు కాశీనాథుని నాగేశ్వరరావు మెమోరియల్ అవార్డు, డీఎం బాషా(అనంతపురం)కు మోటూరు హనుమంతరావు మెమోరియల్ అవార్డు ప్రదానం చేశారు. సాక్షి ఫొటోగ్రాఫర్లు కందుల చక్రపాణి(విజయవాడ), కె.జయశంకర్(శ్రీకాకుళం), వడ్డి శ్రీనివాసులు (కర్నూలు) ప్రశంసా బహుమతులు అందుకున్నారు.



వి. రూబెన్ బెసాలియల్ తీసిన ఛాయాచిత్రం



కందుల చక్రపాణి తీసిన ఛాయాచిత్రం



సనకా పవన్ తీసిన ఛాయాచిత్రం

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు

మచిలీపట్నంటౌన్: దీపం-2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. నగరంలోని ఇనుకుదురుపేటలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలిసి వీటిని పంపిణీ చేశారు. నగరంలోని 27వ డివిజన్‌లో ఫత్తుల్లాబాద్‌లో రూ.3.6 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ కల్వర్టుకు మంత్రి శంకుస్థాపన చేశారు. నగరంలోని 5వ డివిజన్ చిలకలపూడి ఎన్టీఆర్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మంత్రి రవీంద్ర పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ పి.కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు.

పర్రచివరలో ఇల్లు దగ్ధం



పర్రచివర(నాగాయలంక): మండల పరిధిలోని పర్రచివర శివారు దుర్గాప్రసాద్‌పురంలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో మెండు నాగమల్లేశ్వరరావుకు చెందిన రెండు నిట్టాడుల గృహం దగ్ధమైంది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని తెలుస్తోంది. వీఆర్వో టీజీఎస్ సాయిబాబు తహసీల్దార్‌కు అందించిన నివేదిక ప్రకారం ఈ ప్రమాదంలో రూ.6.5లక్షలు నష్టం జరిగింది. రూ.2 లక్షల నగదు, బంగారు ఆభరణాలు తదితర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధం అయ్యాయని బాధితులు చెబుతున్నారు. అవనిగడ్డ అగ్నిమాపక దళ కేంద్రం అధికారి ప్రసాద్, నాగాయలంక ఎస్‌ఐ కె.రాజేష్ ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంటలు విస్తరించకుండా అదుపు చేశారు.

స్నేహితుల మధ్య ఘర్షణ...హత్యాయత్నం

పెడన: స్నేహితుల మధ్య తలెత్తిన ఘర్షణలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరగ్గా అడ్డుగా వెళ్లిన మరొక వ్యక్తికి గాయాలైన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని కాపులవీధిలో నలుగురు స్నేహితులు గురువారం ఉదయం మద్యం తాగారు. సాయంత్రం మళ్లీ మద్యం తాగేందుకు సిద్ధమవగా ఆలస్యంగా ఎందుకొచ్చావని నాగసుధీర్‌ను పూషడపు హేమంత్ ప్రశ్నించాడు. దీపావళి టపాసులు ఇంటి వద్ద ఇచ్చి రావడంలో ఆలస్యమైందని నాగసుధీర్ బదులిచ్చాడు. ఈ విషయమై ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. హేమంత్ ఖాళీ బీరు సీసాను పగలగొట్టి నాగసుధీర్ కంటిపై గాయపరిచాడు. అడ్డు వెళ్లిన కొల్లా కృష్ణాంజనేయులుపై కూడా హేమంత్ దాడి చేయడంతో కృష్ణాంజనేయులు చేతికి తీవ్ర గాయమైంది. ఇరువురిని స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, నాగసుధీర్ పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. కృష్ణాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.సత్యనారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ఎన్‌సీసీ క్యాడెట్ ప్రతిభ

ఉయ్యూరు: గత నెల 16 నుంచి 27 వరకూ గ్వాలియర్‌లో జరిగిన ఆలిండియా రాక్ క్లైంబింగ్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొని వచ్చిన ఉయ్యూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి వరుణ్‌ను శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

ఆ కుటుంబాల్లో అమావాస్య చీకట్లు

ప్రజలందరూ కులమతాలకతీతంగా ఎంతో వేడుకగా జరుపుకొనే దీపావళి పండుగ ఈ ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాలో తొమ్మిది కుటుంబాల్లో మృత్యు ఘంటికలు మోగించింది. ఆనందడోలికల్లో ఊగాల్సిన ఆయా కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు. జి.కొండూరు వద్ద కూలీల ట్రక్కును లారీ ఢీకొని ముగ్గురు కూలీలు దుర్మరణం చెందారు. గుడివాడ-పామర్రు రోడ్డులో కారు కొండాయపాలెం వద్ద కారు కాలువలోకి దూసుకుపోయి ఇద్దరు మరణించారు. పామర్రు మండలం కురుమద్దాలి వద్ద కారు ప్రమాదంలో ఒకరు, కంకిపాడు మండలం కోలవెన్ను వద్ద బైక్ ఢీకొని మరో వ్యక్తి, జి.కొండూరు మండలం వెల్లటూరు వద్ద ఆటో ఢీకొని ఒక మహిళ, కంచికచర్లలో ఓ వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందారు.

ఆటో ఢీకొని మహిళ మృతి



మృతురాలు మేరిమ్మ

జి.కొండూరు: ఆటో ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన వెల్లటూరు గ్రామంలో గురువారం జరిగింది. వివరాలలోకి వెళ్తే...ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు గ్రామానికి చెందిన బొడ్డు మేరిమ్మ(55) తన కోడలు శాంతకుమారి, కూతురు బాలమ్మతో కలిసి గురువారం సాయంత్రం గ్రామ శివారులోని పొలంలోకి వెళ్లారు. పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోకి రాగానే సాయంత్రం 5గంటల సమయంలో వేగంగా వచ్చిన ఆటో మేరిమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మేరిమ్మను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా మార్గంమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త జానుయేసు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు బొడ్డు బాలయ్య గతంలో మృతి చెందాడు. రెండవ కుమారుడు ఏలియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

కారు అదుపు తప్పి కాలువలోకి...



సంఘటనా స్థలంలో వివరాలను పరిశీలిస్తున్న సీఐ సుభాకర్

పామర్రు: కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటనలో కారులో ఉన్న ఇరువురు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటన పామర్రు మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన చలసాని శివరామకృష్ణ(48), దావులూరుకు చెందిన తుమ్మల గోపాలకృష్ణ(50) కారులో గుడివాడ నుంచి విజయవాడకు బయలు దేరారు. గుడివాడ-పామర్రు రోడ్డులో కొండాయపాలెం సమీపం వద్దకు రాగానే కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. కారులో ఉన్న ఇరువురు కారు అద్దాలను బద్దలుకొట్టేందుకు ప్రయత్నించినా ఫలితం లేక వారిద్దరూ కారులోనే మృతి చెందారు. ఆ తర్వాత కొంతసేపటికి అటుగా వచ్చిన కొందరు గమనించి కాలువలోకి దిగి కారు అద్దాలను బద్దలు కొట్టారు. అప్పటికే వారు ఇరువురు ప్రాణాలను కోల్పోయారు. పామర్రు సీఐ సుభాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మృతుడు సింగంశెట్టి గణేష్

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని కోలవెన్ను శివారు మాదాసువారి పాలెం గ్రామానికి చెందిన సింగంశెట్టి గణేష్ (18) గురువారం రాత్రి బైక్‌పై కోలవెన్ను గ్రామానికి వెళ్తుండగా కోలవెన్ను నుంచి వస్తున్న బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన గణేష్‌ను కంకిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే గణేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గణేష్ తండ్రి సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

భార్యను కలవడానికి వస్తూ...



సంఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న పామర్రు సీఐ సుభాకర్

కురుమద్దాలి(పామర్రు): కోచింగ్ సెంటర్‌లో ఉన్న భార్యను పండుగ సందర్భంగా కలవడానికి వస్తూ అనంత లోకాలకు వెళ్లిన భర్త. జాతీయ రహదారిలో కురుమద్దాలి ఫ్లెఓవర్ వద్ద కారు టైరు పంక్చరై కిందకు దూకే ప్రయత్నంలో డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం వీరపనేనిగూడెంకు చెందిన కోడూరి సింహాద్రి హరిప్రసాద్(45) భార్య పామర్రులోని ప్రగతి కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీకి కోచింగ్ తీసుకుంటోంది. గురువారం దీపావళి పండుగ కావడంతో భార్యను కలిసి శుభాకాంక్షలు తెలుపుదామని విజయవాడ -మచిలీపట్నం జాతీయ రహదారిలో పామర్రుకు తన కారులో బయలు దేరాడు. పామర్రు మండలం కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా కారు టైరు పంక్చరైంది. కారు అదుపు తప్పడంతో కారు నుంచి కిందకు దూకే ప్రయత్నం చేయగా హరి ప్రసాద్ తల డివైడర్‌ను బలంగా ఢీకొని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పామర్రు సీఐ సుభాకర్ సంఘటనా స్థలం చేరుకుని మృతుని వివరాలను తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...



కంచికచర్లలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రసాద్

కంచికచర్ల: ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ బి.రాజు కథనం మేరకు గంపలగూడెం మండలం వినగడప గ్రామానికి చెందిన కడియాల ప్రసాద్(65) కంచికచర్లలో టైలరింగ్ పనిచేస్తుంటాడు. తెల్లవారుజామున రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా మండల పరిషత్ కార్యాలయం గేట్ సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

కోనేరుసెంటర్: వియ్యంకుడి ఇంటిపై దాడి చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వాడపల్లి మహేష్ అతని అనుచరులపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నబీ తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన వాడపల్లి మహేష్ అతని వియ్యంకుడు నూకల బాబూరావు కుటుంబాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 30వ తేదీ అర్ధరాత్రి కొబ్బరితోటలో నివాసం ఉంటున్న వియ్యంకుడి ఇంటిపై వాడపల్లి మహేష్ మరికొంతమంది తెలుగుదేశంపార్టీ నాయకులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. ఇంటిలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి సీసీ కెమెరాలను పగులగొట్టారు. జరిగిన సంఘటనపై బాబూరావు కుటుంబం అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాబూరావు ఫిర్యాదు మేరకు వాడపల్లి మహేష్, అతని కుమార్తె జయంతి, నల్లా హరి, పిన్నింటి సుబ్రహ్మణ్యంలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నబీ తెలిపారు.

95.74 శాతం పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్టీఆర్ భరోసా పింఛను కానుక పథకం ద్వారా జిల్లాలోని లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో 2,38,249 మంది లబ్ధిదారులు ఉండగా వీరిలో 2,28,121 మందికి వివిధ రకాల పింఛన్లను అందజేశారు. మొత్తం 95.74 శాతం పంపిణీ జరిగింది. నందివాడ, చల్లపల్లి, పెడన అర్బన్ ప్రాంతాలు పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాలు సాధించాయి.

ఉదయం 6 నుంచి 12 గంటల వరకు సర్వర్లు మొరాయించటంతో అన్ని ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.